

కుమ్మరిగూడలో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మధుసూదన్ రెడ్డి

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయం

### ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్, మే 9, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సం స్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్రెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండలంలోని కుమ్మరిగూడలో రూ.20లక్షల నిధులతో నూతన గ్రామపంచాయితీ భవనం ప్రారంభించారు. రూ.20 లక్షలతో సీసీరోడ్డు, రూ. 5లక్షలతో స్ట్రీట్లైట్లు, పెదవేడులో రూ.10లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ప్రారంభించారు. రూ.20 లక్షలతో సీసీరోడ్డు, రూ. 5 లక్షలతో స్ట్రీట్స్ పనులకు సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డిసిసి ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్యలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు నాణ్యమైన రహదారులు, మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. షాబాద్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శ్రీశైలం, రాజసులోచన. ప్రభాకర్ రెడ్డి, అశోక్, సందీప్ గౌడ్, నర్సింహులు, నాయకులు స్వామి, రాహుల్గుప్తా, యాదయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, అశోక్ గౌడ్, శేఖర్, వేణుగోపాల్, శ్రీనివాస్గుప్తా, భరత్, తదితరులు పాల్గొన్నారు.



జగ్గంగూడలో కంఠమహేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న గౌడ సంఘం సభ్యుల దృశ్యం

# శ్రీకంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవం

**శామీర్‌పేట, మే 9, ప్రభాతవార్త:** జగ్గంగూడలోని శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంభదేవిల కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగింది. మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడలోని శ్రీకంఠమహేశ్వరస్వామి నూతన ఆలయంలో శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవిల కల్యాణోత్సవం కన్నుల పండుగగా ఘనంగా నిర్వహించారు. నూతనంగా శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంభదేవి, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మల విగ్రహాల ప్రతిష్ట శుక్రవారం జరిగిన సంగతి తెలిసిందే. శనివారం శ్రీకంఠమహేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం జగ్గంగూడ గౌడ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగింది. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించి దేవతలకు మొక్కులు తీర్చుకుని బోనాలు సమర్పించారు. ఆ తరువాత రాత్రికి మత్తగొలుపుట,గావు పట్టుట పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జరిగిన కల్యాణోత్సవం, బోనాలు, గావు పట్టుట కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం సభ్యులతో పాటు గ్రామ ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఒఆర్ఆర్‌పై ప్రమాదం

### లారీని ఢీకొట్టి లారీ డ్రైవర్ మృతి

**ఘట్‌కేసర్, మే 9, ప్రభాతవార్త:** ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టగా లారీడ్రైవర్ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ ఔటర్‌రింగ్‌రోడ్డుపై ఘణాపూర్ రోడ్డు సమీపంలో శనివారం తెల్లవారుజామున 4:30 గంటలకు ఈఘటన జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం తుమ్మలనూర్‌కు చెందిన బండారి సాయిబాబు (31) రామునాయుడు అనే వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పెద్దపల్లి నుంచి తన లారీ (టిఎస్22టి-5657)లో ఇటుకలను నింపుకొని వస్తూ మేడ్చల్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా పెద్దఅంబర్‌పేట్ వెళ్తుండగా లారీ ప్రమాదానికి గురయ్యింది. ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టగా లారీ డ్రైవర్ సాయిబాబు తలకు, ముఖానికి, మెడకు, ఇతర శరీర భాగాలకు రక్త గాయాలయ్యాయి. అంబులెన్సులో అతన్ని ఘట్‌కేసర్ సామాజిక ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 5:30 గంటలకు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి మార్చురీలో శవపరీక్ష చేయించామని, మృతుని తండ్రి రాముడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపారు.

## "సింధూర్ విజయ్ దివస్" సందర్భంగా కవి సమ్మేళనం




3



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## గిరిజన యువకుడి ఘన విజయం

### సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్‌నాయక్ ఎంపిక..



4

# ముగిసిన విగ్రహా ప్రతిష్టోత్సవాలు



స్వామి వారిని విగ్రహ ప్రతిష్టాత్సవాలలో పాల్గొన్న ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి

**కీసర,మే9,ప్రభాతవార్త:**
రాంపల్లిదాయర వెంకులోనిగుట్టలోని హేమాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్దానంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా శనివారంతో ముగిసాయి. ప్రతిష్ఠోత్సవాలలో చివరిరోజు టిటిడి వేదపండితుల బృందం ఉదయం విశ్వక్సేనారాధన చేసి హోమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టిటిడి దేవస్ధానం ప్రధాన అర్చకులు శ్రీవేణుగోపాల దీక్షితుల చేతులమీదుగా శ్రీవారి యంత్ర,విగ్రహప్రతిష్ట జరిగింది. స్వామి వారికి పుణ్యాహవచనము,అగ్ని ఆరాధనములు, కుంభారాధన, ధాతాది సామాన్య హోమములు,మహ పూర్ణాహుతి, "సుము హూర్తమునకు" యంత్ర ప్రతిష్టాపన,బింబస్దాపన,శిఖర స్దాపన, కళాన్యాసము,మహ కుంభసంప్రోక్షణ,గోదర్శనము,కన్యా దర్శ నము, ప్రథమార్చన,నీరాజనము, బ్రహ్మఘోష, మహదాశీర్వ చనము ,స్దపతి సన్మానం,నీరాజన మంత్ర పుష్పములు,తీర్ద ప్రసాద వితరణ,సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణము,రాత్రి 9 గంటలకు నీరాజన మంత్ర పుష్పములు,తీర్ధ ప్రసాద వితరణ,ఆచార్య ఋత్విక్ సన్మానం తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి దంపతులు ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి,సీఎం ముఖ్య సలహదారులు వేం నరేందర్‌రెడ్డి

**స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు:**

రాంపల్లిదాయర శ్రీవెంకులోనిగుట్ట హేమాద్రి శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలలో చివరి రోజు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.సిఎం రేవంత్‌రెడ్డి తరపున సిఎం ముఖ్య సలహదారు,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు.మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,హిందూ ధర్మ ప్రచారకులు స్వామి రాధా మనోహర్ దాస్,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ క్రిష్ణారెడ్డి,మాజీ ఎమ్మల్యేలు మైనంపల్లి హనుమంత్‌రావు,సుధీం రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్,మేడ్చల్,ములుగు జిల్లాల డిసిసి కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,అశోక్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.వీరందరికి ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి ఘనంగా సత్కరించి శ్రీవారి చిత్ర పటాలను అందజేశారు.



స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తున్న మంత్రి సీతక్క



స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు



# పచ్చళ్ళు పెట్టాలనుకుంటే ...పచ్చడే...

పెరిగిన ధరలతో పచ్చడి మెతుకులు కూడా కష్టమే..
గాలివాన దెబ్బకు పెరిగిన మామిడికాయ ధరలు..
మంచి నూనె, మిరపపొడి, అల్లం, వెల్లుల్లి
ఇతర ధరలకు సైతం రెక్కలు..
ఆవకాయ రుచులకు సామాన్యులు, నిరుపేదలు దూరం

**షాద్‌నగర్, మే 9, ప్రభాతవార్త :** ఆవకాయ మన అందరిదీ.. అన్న పాట విన్నప్పుడు నిజమే అనిపించేది.. అల్లం మామిడి కాయ, నువ్వుల మామిడి, "ఆవ" కాయ పచ్చడి ఇలా ఎన్నో రకాల ఆవకాయ పచ్చడి కాలక్రమణ కొందరిదిగా మారిపోతుంది.. సామాన్యులకు, నిరుపేదలకు అందని ద్రాక్ష అవుతుంది.. దీనికి కారణం విపరీతంగా పెరిగిన ధరలు.. దీంతో పచ్చడి తయారు చేసుకోవడం కూడా భారంగా మారుతుంది. ఒక్కసారి మన తెలుగు వారి ఆవకాయ గత, వర్తమాన చరిత్రల గురించి చెప్పుకుంటే.. ఇంటింటా ఆవకాయ..తెలుగు రాష్ట్రాలలో ఆవకాయ జాడి కనిపించని ఇల్లు అంటే ఎక్కడ ఉండేది కాదు.. మే, జూన్ మాసాలు వచ్చాయి అంటే చాలు.. ఆవకాయ తయారు చేసేందుకు ఇక్కడి జనం సంసిద్ధమవుతారు. రకరకాల ఆవకాయలు జాడీలలో నింపుకొని ఏడాది వరకు వాటిని వాడుకుంటారు. ముఖ్యంగా రైతు కూలీలు, కార్మికులు ఆవకాయ మీద ఎక్కువగా ఆధారపడుతుంటారు. ఉదయమే జొన్న రొట్టె ఆవకాయ తిని పొలాలకు, పరిశ్రమలకు వెళుతుంటారు. టిఫిన్ కట్టుకున్న అందులో ఆవకాయ తప్పనిసరి. అందుకే ఈ ఆవకాయ తయారీకి అంత ప్రాధాన్యత ఉంది. అయితే కాలక్రమేణా ఆవకాయ తయారీ అత్యంత భారంగా మారుతుంది. పెరిగిన నూనె ధరలు, మిరపపొడి ధరలు, మామిడికాయల ధరలు, ఆవాలు, జిలకర వంటి వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆవకాయకు సామాన్యులు, నిరుపేదలు దూరమవుతున్నారు. ఒకసారి వర్తమాన పరిస్థితుల్లోకి వెళ్తే..

**ఆవకాయకు ధరల ఘాటు..**

సాధారణంగా ఇంట్లో చేసే ఆవకాయ ఘాటు కన్నా వాటి ధరలకు అటు అధికంగా ఉండడంతో చేటు మొదలైంది. గతంలో 40 నుంచి 60 రూపాయలకు కేజీ చొప్పున ఉన్న పుల్ల మామిడికాయలు వాటి సైజును బట్టి ఈసారి 80 నుంచి 100 చొప్పున అమ్ముతున్నారు. పచ్చడికి అవసరమయ్యే వేరుశనగ నూనె 250 నుంచి 300 వరకు పెరిగింది. ఆవాలు 120 నుంచి 130 కి చేరుకోగా, వెల్లుల్లి ధర 260 నుంచి 320కి చేరుకుంది. ఎండుమిరపకాయలు 250 నుంచి 300 కు కేజీ ఉండగా ఎప్పుడు వాటి ధర 500 నుంచి 600 కు పెరిగిపోయింది. కేజీ మిరపపొడి 500 రూపాయలకు చేరింది. చివరికి మామిడికాయలను ముక్కలు చేసేందుకు కూడా కిలోకి 20 నుంచి 40 వరకు డిమాండ్ ను బట్టి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత లెక్కల ప్రకారం రెండున్నర కిలోల పచ్చడి తయారీకి ఖర్చు అవుతున్న మొత్తం వందల పై మాట. అందుకే సామాన్యులు పచ్చడి తయారీ పట్ల ఆసక్తి చూపడం లేదు. మధ్యతరగతి వర్గాల్లో కూడా గతంలో చేసినట్లు కాకుండా అందులో సగం మాత్రమే తయారు చేసుకుంటున్నారు. దీనితో సామాన్యులు, నిరుపేదల కుటుంబాల్లో పచ్చడి మెతుకులు తయారు చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. సమయానికి ఏం లేకపోయినా కాసంత ఆవకాయ వేసుకుని అన్నం తిని పేదవాళ్లకు ఆ భాగ్యం కూడా లేకుండా పోతుంది. అంతా కాల మహిమ.. ఇక ఈసారి అకాల వర్షాలకు గాలి మన ధర్మారాలకు మామిడి తోటలో కాయలు రాలిపోయాయి. మిగిలిన కాయలపైనే ప్రస్తుతం మార్కెట్ ఆధారపడి ఉంది. మార్కెట్లో మామిడికాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఒక్కొక్క 20 రూపాయలు నుండి మొదలు పెడితే మంచి రకం 100 రూపాయల వరకు కూడా దొరుకుతున్నాయి. ఇప్పటికే పలు మామిడి తోటలను ఇతర ప్రాంతాలకు చెందిన వారు గుత్తాకు పట్టుకుంటారు. ఎక్కువగా కర్ణాటక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారస్తులు ఇక్కడ తెలంగాణలో మామిడి తోటలు పడుతుంటారు. మామిడికాయల ధర నిర్ణయం కూడా వారి చేతుల్లోనే ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం నుండి మామిడికాయలు మహారాష్ట్ర కర్ణాటక ఆంధ్ర ప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ ఉంటారు. తినే పనులకు సంబంధించిన వాటితో పాటు ఊరగాయలకు కూడా అనేక ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ఉంటారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



గృహ ప్రవేశంలో రిబ్బన్ కట్ చేస్తున్న స్పీకర్ నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశాలలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్.

**మోమిన్‌పేట్, మే 9, ప్రభాతవార్త:** ఇండ్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడం కొరకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్చాల్ గ్రామంలో నూతన గృహప్రవేశాలకు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పట్టణాలకు ధీటుగా గ్రామాలలో చక్కగా ఇండ్లను నిర్మించుకోవడం చాలా సంతోకరమని అంటూ నూతన ఇండ్లు నిర్మించుకున్న వారిని అభినందించారు. గ్రామంలోని పులుగు మంజుల ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. అనంతరం గౌండ్ల తుల్జమ్మ సొంతంగా నిర్మించుకున్న ఇంటిని ప్రారంబించారు. ఇంకా ఇండ్లులేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారుంటే వారి పూర్తి వివరాలు సేకరించి జాబితాను పంపించమని స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పార్టీ నాయకులకు సూచించారు. మొదటి విడుతలో 24, ఇండ్లు మంజూరు కాగా అందులో 6, ఇండ్లు పూర్తిగా నిర్మించుకోగా ఇంకా 14,ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, 4, ఇండ్లు మాత్రం వారి వారి స్వంత కారణాల వల్ల ఆలస్యం అయ్యిందని తెలిపారు. మా గ్రామానికి ఇంకా 25, ఇండ్లు మంజూరు చేస్తే అందరు స్వంత ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కుంటారని గ్రామస్తులు కోరగా, అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించి వెంటనే అర్హులైన వారి వివరాల జాబితా తయారు చేసి పంపమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు నర్సోత్తంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురెందర్, ఉప సర్పంచ్ రమేశ్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు ఇబ్రాహిం, రఘురాంరెడ్డి, దామోదర్ సాగర్, విజయ్ కుమార్, ప్రవీణ్‌గౌడ్, శేఖర్ యాదవ్, నర్సింలు, తౌఫిక్, శఫి, సుధాకర్ రెడ్డి, పెంటయ్య, బాల్‌రాజు, పాండు, శ్రీశైలం, ప్రసాద్‌రెడ్డి, ప్రభుసాగర్, రవి, హరిక్రిష్ణ, ప్రదీప్ యాదవ్, బాలకృష్ణ, సాయి, భానుప్రసాద్, నరహరి, శైలు, గ్రామస్తులు అభిమానులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో కార్డన్ సెర్చ్

### పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 2 త్రీ వీలర్లు స్వాధీనం

### అనుమానితుల వేలిముద్రలతో నేర చరిత్ర పరిశీలన



**మొయినాబాద్, మే 9, ప్రభాతవార్త :** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఫ్యూచర్ సిటీ చేవెళ్ల జోన్ ఏసీపీ కిషన్, ఎస్‌హెచ్‌వో మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సేర్చ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక తనిఖీలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మొత్తం 43 ద్విచక్ర వాహనాలు, 10 ఫోర్ వీలర్ వాహనాలు, 7 త్రీ వీలర్ వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో నెంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలు, 2 త్రీ వీలర్ వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ముఖ్యంగా మొయినాబాద్ మున్సిపాలిటీలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఫామ్ హౌస్‌లలో నివాసముంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారంతో ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను సేకరించి, వాటి ఆధారంగా వారి నేర చరిత్రను పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 11న బిసిటిఏ ప్రతిభా పురస్కారాల ప్రదానం

**చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త :** బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బిసిటిఏ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సోమవా రం మహాత్మా జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కారాలు -2026 ప్రదా నం చేయనున్నట్లు ఆ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బియ్యం సంతోష్ కుమార్, లక్ష్మీకాంతరావు లు ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, నాగర్క ర్నూల్ ఎంపి మల్లు రవి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తదితర ప్రముఖులు హాజరైతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యా ర్థులకు గౌరవ పురస్కారం, ఉత్తమ విద్యా ప్రమాణాలు పాటించి ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.



ప్రభుత్వ సలహాదారు హనుమంతరావుకు సంఘీభావం తెలుపుతున్న వెంకటేష్

## ప్రధాని మోడీ పర్యటనను బిసిలు బహిష్కరించాలి

**చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడి తెలంగాణ పర్యటనను బీసీలు కలిసికట్టుగా బహిష్కరించాల ని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇంచార్జి కె.వెంక టేష్ కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మొదలు పెడుతున్న జనగణలో బీసీల కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు లు వి.హనుమంతరావు శనివారం అంబర్‌పేట్‌లోని తన నివాసం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు పాతబస్తీ నేతలు మద్దతు పలికారు. సీనియర్ నేత వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయ కులు తరలివెళ్లి హనుమంతరావుకు పార్టీ కండువా కప్పి పూలమాలతో సన్మానించారు. తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో సమగ్ర కులగణన చేస్తామన్న మోదీ మాటలు ఏమైయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పా టు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని కులాలు ఆధిపత్యం చేస్తూ బీసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని బిసిలను మో సం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### మూడు రాష్ట్రాల ఫలితాలు పునరావృతం అవుతాయి

**-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి**

**చిక్కడపల్లి మే 9 ( ప్రభాతవార్త ):** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయోత్సాహం తెలంగాణలోనూ కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లిలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మోడీ భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాగ్ లింగంపల్లి డివిజన్ లోని చిక్కడపల్లి, బాగ్ లింగంపల్లి, అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, సంజయ్ నగర్ తదితర ప్రాంతాలలో ప్రచార కార్యక్రమా న్ని చేపట్టారు. మోడీ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారులు, భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జక్కా శ్రీను, జైపాల్ రెడ్డి, బీరయ్య, నరసింహ, రాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

### మానవత్వానికి నిలువుటద్దం దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులు

**చిక్కడపల్లి మే 9 ప్రభాతవార్త :** నిస్వార్థ సేవే


దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన దృశ్యం

లక్ష్యంగా, ఆపద లో ఉన్నవారికి అండగా నిలుస్తున్న సేవామూర్తి దుడ్డు సుబ్ర హ్మణ్యం దంపతులు అని వక్తలు ప్రశంసించారు. శనివారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ్ క్రియేషన్స్ అధినేతలు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి సంయుక్త ఆధ్వ ర్యంలో అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి గా హాజరైన పేరి నాగేశ్వరరావు, పేరి విజయ లక్ష్మి , సిండికేట్ బ్యాంక్ మాజీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పేరి కామేశ్వర రావు మాట్లాడుతూ సేవ అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అవసరమైన సమయంలో తోడుగా నిలబడటమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. సమాజంలో ధనవంతులు ఎందరో ఉన్నా, పరుల కష్టాన్ని తన కష్టంగా భావించే వారు అరుదుగా ఉం టారని, ముఖ్యంగా ఎవరైనా మరణించినప్పుడు ఆ కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఇస్తూ, అంత్యక్రియల ఏర్పాట్లలో స్వచ్ఛందంగా పాల్గొని సుబ్రహ్మణ్యం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశం సించారు. ఆయన సేవలో భాగస్వామిగా నిలుస్తున్న ఆయన సతీమణి ని కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, కళాకారులు పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు.


నార్సింగి సర్కిల్ కోకాపేట్ వద్ద స్వీయ గణన వాకథన్‌ను ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావ్.

## ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయగణన చేసుకోవాలి

**- జడ్‌సి హేమంత్ సహదేవరావు**

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయ గణనను చేసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ బి.హేమం త్ సహదేవరావు పేర్కొన్నారు. శనివారం నార్సింగి సర్కిల్ పరిధి లోని కోకాపేట్ వద్ద స్వీయ గణనపై ఏర్పాటు చేసిన మారథన్‌ను జడ్‌సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజలలో ఉన్న అపోహలు తొలగించి, అవగాహన కల్పించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు మీ కుటుంబ సభ్యుల వివరాలను మీ మొబైల్స్/కంపూ ర్యటర్ల ద్వారా పోర్టల్‌లో రాష్ట్రంను ఎంచుకొని 33.ప్రశ్నలకు సమా ధానం ఇవ్వాలని సూచించారు. మీ వివరాలను మీరే పూర్తి చేసుకుంటే సమయం ఆదా అవుతుందని, లేదంటే అధికారులు మీ ఇళ్ల కు వచ్చి పూర్తి వివరాలు తీసుకుంటారని తెలిపారు.

## విద్యార్థిగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే విలువలు నేర్చుకున్నా

**- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమల దేవి**

**అత్తాపూర్ మే9,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80 వ కాలేజీ డే ఉత్సవాలు రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ తిరుమలాదేవి ఈద ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. తాను 40 ఏళ్ల క్రితం కమ్యూనిటీ సైన్స్ బీ ఎస్ సీ, ఎం ఎస్ సీ కోర్సు లు ఈ విశ్వవిద్యాలయం లోనే చదివానన్నారు. క్రమశిక్షణ, విలువలు ఈ సంస్థ నుంచే నేర్చుకున్నానని.. తాను ఇప్పుడు ఎంత ఉన్నత స్థానం లో ఉన్నా ఈ విశ్వవిద్యాలయం లో నేర్చుకున్న మంచి అంశాలే తనను నడిపిస్తున్నాయని తిరుమలా దేవి వివరించారు. పౌష్టికాహారం, వంటలు, టెక్స్ టైల్స్ వంటి కీలక సబ్జెక్ట్ లు తాము ఆనాడు హోమ్ సైన్స్ కోర్సు లో చదివామని వివరించారు. నేడు ప్రతి ఒక్కరూ శారీరక సౌష్టవం గురించి మాట్లాడుతున్న తరుణాన ఆ కోర్సు ఎంత ఉపయుక్తం గా ఉంటుందో ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విశ్వ విద్యాలయం లో వృద్ధులకి వెల్ నెస్ సెంటర్ ప్రారంభించడం వంటి అనేక మంచి కార్యక్రమాలు చేపట్టినందుకు ఉప కులపతి అల్దాస్ జానయ్య ని జస్టిస్ తిరుమలాదేవి అభినందించారు. మొబైల్ కారణంగా ప్రపంచమే మనిషి చేతిలో ఉంటున్న ఈ కాలం లో మానవత్వం, క్రమ శిక్షణ లు కలిగి సమాజం లో మంచి మనుషులు గా గుర్తింపు పొందాలని జస్టిస్ తిరుమలాదేవి విద్యార్థుల కి సూచించారు. ముగ్గురు ప్రధాన మంత్రులు, ఒక ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం అనేక రంగాలకి ఎందరో ప్రముఖులని అందించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ విశ్వ విద్యాలయం విద్యార్థినైన తాను ఉపకులపతి



బాధ్యత లు చేపట్టిన తర్వాత విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. వాటిలో కొన్ని కఠినం గా అనిపించినా విద్యార్థుల బాగు కోసమే ఆ నిర్ణయాలు తీసుకున్నామని, విద్యార్థులు అది అర్థం చేసుకోవాలని విశ్వ విద్యాలయాలు విజ్ఞాన, పరివర్తన, సంస్కరణ కేంద్రాలని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల పైననే ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం లో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి కళాశాల ప్రగతి నివేదిక ని సమర్పించారు. బీ ఎస్ సీ పూర్తి చేసిన కొందరు విద్యార్థులు తమ కళాశాల అనుభవాలని వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ మ్యాగజైన్ సీడీని అతిథులు విడుదల చేశారు. వివిధ పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ డాక్టర్ బి. ని. దిటీ. విద్యాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీ రాణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సి. హెచ్. వేణుగోపాల రెడ్డి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె. బి. ఈశ్వరి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి, కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జి డాక్టర్ వి. రామ్ రెడ్డి, బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి : మాజీ ఎంపి టీజీ వెంకటేష్

**చిక్కడపల్లి మే 9 ( ప్రభాతవార్త ) :** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, ప్రముఖ సామాజిక సేవకులు కొటికె విఠల్ నియమితుల య్యారు. శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో సంస్థ గ్లోబల్ చైర్మన్, మాజీ ఎంపీ టీ. జీ. వెంక టేష్ ముఖ్య అతిథిగా హాజరై కొటికె విఠల్ కు నియామక పత్రాన్ని అందజేసిసత్కరించి, మాట్లాడారు. కొటికె విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహ దారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి ఉచిత అన్న దానం నిర్వహిం చడం, చలికాలం లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకా లంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేషగుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన న్యాయవాది మదుపల్లి రవిగుప్త మాట్లా డుతూ కొటికె విఠల్ పట్టుదల, కార్యద క్షతకు ప్రతీక అని అన్నారు. ఏ బాధ్యత చేపట్టినా సం పూర్ణ నిబద్ధతతో నిర్వహి స్తారని


కొటికె విఠల్ ను నియామకపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ

కొనియాడారు. అనంతరం కొటికె విఠల్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయని, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ సలహాదా రుగా సేవలందించిన విషయా న్ని గుర్తు చేశారు. జాతీయ సలహాదారుగా దేశవ్యాప్తంగా నిర్వ హించిన సేవా కార్య క్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. భారతీయ జీవిత బీమా సంస్థ సీనియర్ మోస్ట్ ఏజెంట్, ఏజెంట్ల నాయకుడు బి.ఎన్. చారి మాట్లాడుతూ.. కొటికె విఠల్ ప్రతిరోజూ కొత్త రికా ర్డులు సృష్టిస్తూ ప్రతి సంవ త్సరం నంబర్ వన్ స్థానాన్ని నిలబె ట్టుకుంటున్నారని అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ కొటికె విఠలను సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం

**- నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్**

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** గండిపేట మండలంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వట్టినాగులపల్లిలోని వార్డు కార్యాలయం వద్ద రైతు వారము కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్.ఇ శ్రీనివాస్ మాట్లాడుతూ గొలుసు కట్టు చెరువులను పరిరక్షించుకునేందుకు, చెరువుల్లోకి వరద నీరు మోసుకు వచ్చే కాలువలను కబ్జాల చెర నుంచి విడిపిస్తామని స్పష్టం చేశారు. చెరువుల భూమిలో, బఫర్ జోన్‌లో ఎక్కడా కూడా నిర్మాణాలు చేపట్టకూడదని, కేవలం పంటలు పండించుకోవాలని సూచించారు. చెరువుల భూములు, వరద కాలువల భూములు కబ్జాలకు గురైతే వెంటనే మా నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలని రైతులకు, ప్రజలకు సూచించారు. చెరువులను కాపాడుకుంటే భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని, ప్రజలకు అవసరమైన నీరు అందుతుందన్నారు. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు భూమిలో ఇంకడం లేదని, కాంక్రిట్ జంగల్‌గా గ్రామాల


వట్టినాగులపల్లిలో ఏర్పాటు చేసిన రైతు వారము కార్యక్రమంలో పాల్గొన్న నీటి పారుదల శాఖ అధికారులు, రైతుల దృశ్యం.

న్నీ మారడం వలన నీరంత దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుందన్నారు. వట్టినాగులపల్లిలోని గౌని చెరువు, ఎర్రకుంట, తూముకుంట, కొత్త చెరువుల వద్దకు అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ చెరువుల్లోకి వరద నీటిని తెచ్చే కాలువలను సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు సురేష్ బాబు, రమ, నరేందర్, లక్ష్మారెడ్డి, రైతులు ముత్యంరెడ్డి, చుక్కయ్య, రాఘవరెడ్డి, తారాసింగ్, బాల్‌రాజ్, వెంకటేష్, దర్శన్, శేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగీత విభావరికి ముగ్ధులైన కళాప్రియులు

**-ఆరభి సంస్థ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

**మాదాపూర్, మే 9 (ప్రభాత వార్త):** సంగీతానికి ఎల్లలు లేవని, అది సుమధురం, రసవత్తరం, మహత్తరమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికలో జరిగిన ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ 28వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాద పరంపర పేరుతో నిర్వహించిన ఈ విశిష్ట కార్యక్రమంలో 150 మంది వయోలిన్ కళాకారులు పాల్గొని గ్రాండ్ వయోలిన్ సింఫనీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కళారత్న డాక్టర్ అశోక్ గుర్జాలే సంగీత దర్శకత్వంలో గంటన్నర పాటు సాగిన ఈ సంగీత మహోత్సవం కళాప్రియులకు అపూర్వ అనుభూతిని కలిగించింది. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ చిన్నారుల నుంచి సీనియర్ కళాకారుల వరకు అందరూ కలిసి అందించిన ఈ సంగీత కచేరి భారతీయ సంగీత వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కీర్తనలు వింటూ తాను భావోద్వేగానికి గురయ్యానని, తెలియకుండానే ఆనందభాష్పాలు వచ్చాయని పేర్కొన్నారు. భారతీయ సంగీతం ఒక తపస్సు అని, సంగీత సాధనలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. అన్నమయ్య, త్యాగయ్య, కట్ట బొమ్మన, ఝాన్సీ రాణి లాంటి మహనీయుల గురించి మన చరిత్ర పాఠాల్లో తక్కువగా ఉందని, దేశాన్ని దోచిన అలెగ్జాండర్, రాబర్ట్ క్లైయివ్ గురించి ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఆరభి సంస్థ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ గుర్జాలే ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న సంగీత సేవలను కొనియాడారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు పాలకుర్తి రామచంద్ర శర్మను మృదంగ నాద విభూషణ బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ దీపిక రెడ్డి, డాక్టర్ దారూరి రాఘవాచారి, త్రిచూర్ బ్రదర్స్ రాంకుమార్ మోహన్, డాక్టర్ జొన్నలగడ్డ అనురాధ, కలెక్టర్ స్నేహ శబరీష్, సినీ నటుడు తనికెళ్ళ భరణి తదితరులు పాల్గొన్నారు. వాతాపి గణపతిమ్ భజేతో ప్రారంభమైన ఈ సంగీత విభావరి బ్రహ్మకడిగిన పాదము, బంటురీతి కొలువు, నగుమోము, బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, పలుకే బంగారమాయేనా వంటి అనేక శాస్త్రీయ కీర్తనలతో సంగీతాభిమానులను అలరించింది. అనంతరం ఫ్యూజన్ సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. నాలుగేళ్ల చిన్నారి శ్రీకరి నుంచి యువ, సీనియర్ కళాకారుల వరకు పాల్గొన్న ఈ గ్రాండ్ వయోలిన్ సింఫనీ ఆద్యంతం సంగీత మాధుర్యాన్ని పంచింది. చివరగా ఆరభి సంస్థ సంగీత విద్యార్థులు తమ గురువు డాక్టర్ అశోక్ గుర్జాలేను ఘనంగా సత్కరించారు.

## 11నుండి మండలంలో విద్యా వారోత్సవాలు

**-ఎంఈఓ శంకర్ రాథోడ్**

**అత్తాపూర్ మే9 ,ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఇందులో భాగంగా రాజేంద్రనగర్ మండలంలో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. శనివారం ఎంఈఓ శంకర్ రాథోడ్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ... స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఈనెల 11వ తేది నుండి 17వ తేది వరకు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 11న ఫౌండేషన్ డే కార్యక్రమాలు, 12న పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల కోసం రివిజల్ కార్యక్రమాలు, 13న నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్యా నిర్వహణపై సర్పంచ్‌లకు సదస్సు, 14న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట, 15న గ్రంథాలయ నిర్వహణ ,16న ఆర్ట్స్ అండ్ కల్చరల్ ,17న విద్యార్థుల విజయోత్సవాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## బిఎంటిపై బసవతారకంలో నర్సింగ్ సదస్సు

**జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్తః** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో 'బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్(బిఎంటి) నర్సింగ్- విజ్ఞానం, ఆచరణల మధ్య వారధి' అనే అంశంపై శనివారం ఒక రోజు నర్సింగ్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది నర్సింగ్ నిపుణులు హాజరయ్యారు. సదస్సును ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. సెంథిల్ జే. రాజప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఫణి కోటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కందుల శ్రీవాణి తదితరులు ప్రారంభించారు. డా. కల్పనా రఘునాథ్, ఆంకాలజీ నర్సింగ్‌లో పనిచేసే నర్సులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డా. సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ బిఎంటి సంరక్షణలో ఆధారాధారిత వైద్య విధానాలను నర్సులు సమర్థంగా అమలు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇప్పటివరకు 700కు పైగా బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, అందులో 200 చిన్నారుల కేసులు ఉన్నాయన్నారు. ఈ విజయాల్లో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని అభినందించారు. సదస్సులో టాటా మెమోరియల్ హాస్పిటల్, రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ తదితర జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు కండిషనింగ్ రెజిమెన్లు, కార్ట్ సెల్ థెరపీ, ట్రాన్స్‌ప్లాంటేషన్ సమస్యలు, సపోర్టివ్ కేర్ నర్సింగ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా బిఎంటి నర్సింగ్‌లో ఆధునిక వైద్య విధానాలు, రోగి సంరక్షణలో నర్సుల కీలక పాత్రపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.


సదస్సును ప్రారంభిస్తున్న జేఎస్ఆర్ ప్రసాద్, చిత్రంలో ఇతర వైద్యులు ఉన్నారు.

## వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : సీతారాం ధూళిపాళ

**నార్సింగి, మే 9 ప్రభాతవార్త :** మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17.వ,తేదీన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం మణికొండలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రంను బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావ్‌లతో కలిసి సీతారాం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డి నాయకత్వంలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17.వ, తేదీన సాయంత్రం 4ః30.గంటలకు నెక్‌నాంపూర్ చింతచెట్టు బటర్‌ఫ్లై కూడలి నుంచి మర్రిచెట్టు కూడలిలోని జలమండలి కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ కార్యక్రమం


మణికొండలో "వాక్ ఫర్ వాటర్" కరపత్రంను విడుదల చేస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

ఉంటుందని వివరించారు. మనం ఏ పని చేయాలన్నా నీరు అవసరం ఉంటుందని, ప్రజలకు అవసరమైన మంచినీటిని సరఫరా చేయడంలో అధికారగణం ఘోరంగా విఫలం అవుతుందన్నారు. ప్రజలు ఇళ్లల్లో వేసుకున్న బోర్లన్నీ ఎండిపోయాయని, జల మండలి నుంచి సరఫరా చేస్తున్న నీరు సన్నని ధారవలే వస్తుందని, వాడుకునేందుకు, తాగేందుకు నీరు లేక మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ చేపడుతున్న వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## యువ వైద్యులకు న్యూరో సైన్సెస్‌లో మాస్టర్ శిక్షణ

**సికింద్రాబాద్, మే 9 ప్రభావార్త:** న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, అత్యాధునిక చికిత్సా విధానాలపై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు శనివారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని ఆడిటోరియంలో మాస్టర్ క్లాస్ ఇన్ న్యూరాలజీ న్యూరోసర్జరీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఐఎన్ఎస్) న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, గాంధీ ఆసుపత్రి న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, పాన్ రీసెర్చ్ ఫౌండేషన్, తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ (టీఎన్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల శిక్షణా సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా సదస్సులో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 80 మందికి పైగా పీజీ వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డా. ధైర్యవాన్, సెక్రటరీ డా. ఎన్. ప్రతాప్ కుమార్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డా. డి. రాజా రెడ్డి, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ అధ్యక్షుడు డా. జె.ఎం.కె. మూర్తి, నిర్వహణ కార్యదర్శులు డా. టి.వి.ఆర్.కె. మూర్తి, డా. సయ్యద్ అమీర్ బాషా పస్పాల మాట్లాడుతూ న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ మాస్టర్ క్లాస్ ద్వారా వారి క్లినికల్ నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యమ ని తెలిపారు. రోగుల నిర్ధారణకు సంబంధించిన ప్రాథమిక పరీక్షా విధానాలు, క్లినికల్ కేస్ డిస్కషన్స్, మాక్ ఎగ్జామినే షన్ సెషన్ల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొ న్నారు. ఈ సదస్సు నిర్వహణలో


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య బృందం

గాంధీ ఆసుపత్రి న్యూరోస ర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. శ్రీనివాస్, ప్రొఫెసర్ కె. రవి, న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్ కీలక పాత్ర పోషించడమే కాకుండా, విద్యార్థులకు తమ అమూల్యమైన సూచనలు అందించారు. సీనియర్ ప్రొఫెసర్లు తమ అనుభవా లను పంచుకుంటూ, పరీక్షల సమయంలో విద్యార్థులు పాటిం చాల్సిన మెళకువలను వివరించారు. హైదరాబాద్‌తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థల కు చెందిన సీనియర్ అధ్యాపకులు ఈ సెషన్లలో బోధకులుగా వ్యవహరించారు. బోధనాత్మక ఉపన్యాసాలు, ప్రాక్టికల్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. వైద్య విద్యార్థులలో క్లినికల్ ప్రాక్టీస్‌పై సమగ్ర అవగాహన కల్పించేందుకు రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఎన్ఐఎస్) నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇలాంటి మరిన్ని విద్యా సదస్సులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త నిర్వహణ కార్యదర్శులు డా. మురళీధర్ రెడ్డి , డా. లలిత పి, పలువురు సీనియర్ న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు

## చైతన్యానికి ప్రతీక బుర్రకథ

**..ఆచార్య కొలకలూరి ఇనాక్**


బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

**చిక్కడపల్లి మే 9 ( ప్రభాతవార్త ) :** తెలుగు నేల గర్వించదగ్గ అద్భుతమైన కళా ప్రక్రియ బుర్రకథ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్ కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో నక్క ఉప్పలయ్య బృందం చే సీతాకళ్యాణం అద్భుతంగా నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య కొలకనూరి ఇనాక్ మాట్లాడుతూ సాంఘిక చైతన్యానికి, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బుర్రకథ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు జానపద కళారూపాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో గానసభ నిర్వాహకులు ఏర్పాటు చేయడం విశేషమని అన్నారు. కళాకారులను ఆదరిస్తున్న గానసభ అధ్యక్షుడు జనార్ధన మూర్తి అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యుడుశ్రీనివాస్ పాల్గొన్నారు.

### కేబీఆర్ ఉద్యానవనం వద్ద బిఆర్ఎస్ ఆందోళన

**జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్తః** హెచ్-సిటీ పేరుతో కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ చెట్లను నరకడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కేబీఆర్ ఉద్యానవనం ముందు ఆందోళన నిర్వహించారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, జార్వల నవీన్‌నాయక్‌ల ఆధ్వర్యంలో ఇక్కడ ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని ఆందోళన చేపట్టారు. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడం దారుణమని మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి పచ్చ దనంపై ఒక స్పష్టమైన వైఖరి లేదని, అందుకో ఎన్నో ఏళ్ల నుంచి నీడనిస్తున్న చెట్లను తొలగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఇతర బిఆర్ఎస్ నేతలు

### మోడీ సభను విజయవంతం చేయాలి : తోకల శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

**చార్మినార్,మే 9 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గానికి చెందనముఖ్య నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరగనున్న బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్నారని, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి 30 బస్సులు,150 కార్లు, మూడు వేలు పైగా జన సమీకరణతో బయలు దేరాలని తెలిపారు. పరేడ్ గ్రౌండ్ రంగ సభను విజయవంతం చేయాలని ఆయన బిజెపి నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుచ్చిరెడ్డి, అడికె జనార్ధన్, బబ్లూ, ఎల్‌వి రెడ్డి, పృథ్వీరాజ్, బొల్ల రామకృష్ణ, కృష్ణ జయంతి, అంజమ్మ, ఎండి షకీల్, సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కిడ్నాప్ వ్యవహారంలో రౌడీషీటర్లు!

**- టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు నిందితులు**

**జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్తః** ప్రేమ వ్యవహారంలో కిడ్నాప్‌కు పాల్పడి డబ్బులు దండుకున్న ముఠాలోని అయిదుగురు సభ్యులు టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ముఠాలో ఇద్దరు నిందితులు రౌడీషీటర్లుగా ఉన్నట్లు తెలుస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసులమంటూ కొందరు వ్యక్తులు నిఖిల్, సాయి, మహేష్‌లను కిడ్నాప్ చేసి మొయినాబాద్ సమీపంలో దాడికి పాల్పడి వారి నుంచి రూ. 33లక్షలకుపైగా వసూలు చేసిన విషయం విదితమే. ఈ సంఘటనలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అయిదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా వారిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నట్లు గుర్తించారు. కాగా ప్రేమ వ్యవహారంలో యువతి గతంలో నిఖిల్‌పై కేసు పెట్టడంతో అతను కోర్టు నుంచి అరెస్ట్ చేయకుండా ఆర్డర్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే నిఖిల్‌కు బుద్ధి చెప్పాలని ఈ ముఠా సహకారం తీసుకొంది. ఈ క్రమంలోనే ముఠా డబ్బు వసూలుకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా నిందితులు అదుపులో ఉన్నట్లు పోలీసులు ధృవీకరించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బంజారాహిల్స్ పోలీసులు స్పష్టం చేశారు.

# గిరిజన యువకుడి ఘన విజయం

**సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా మహేందర్‌నాయక్ ఎంపిక..**



మహేందర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్..

**షాద్‌నగర్, మే 9, ప్రభాతవార్త :** నూతనంగా వెలువడిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్2025 ఫలితాల్లో కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామపంచాయితీ పరిధిలోని పొడగుట్ట తాండాకు చెందిన కేతావత్ మహేందర్ నాయక్, లక్షి ్మ మరియు దివంగత గోపీచంద్ నాయక్ కుమారుడు, సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ (ప్రివెంటివ్ ఆఫీసర్) పదవికి ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. సాధారణ గిరిజన కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదువుకుని ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన మహేందర్ నాయక్ విజయంపై స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు, సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ గారు మహేందర్ నాయక్‌ను ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, తాండాలకు చెందిన యువత కూడా లక్ష ్యసాధనలో వెనుకబడరని మహేందర్ నాయక్ నిరూపించాడని కొనియాడారు. భవిష్యత్తులో తాండా మరియు గ్రామీణ ప్రాంత విద్యార్థులు మహేందర్ నాయక్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయిలకు చేరుకుని తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. అలాగే విధిలో చేరిన అనంతరం ప్రజలకు న్యాయం చేసే దిశగా నిజాయితీతో, నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వర్తించాలని సూచిస్తూ మహేందర్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానించిన వారిలో గ్రామ సర్పంచ్ హరి శేఖర్ యాదవ్, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

# పూడూర్ డంపింగ్ యార్డులో చెత్త వేయడం ఆపాలి




పూడూర్ గ్రామ చెత్త డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

**మేడ్చల్, మే 9, ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్‌లోని పూడూర్ గ్రామంలో గల చెత్త డంపింగ్ యార్డులో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వేస్తున్న చెత్తను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ నాయకులు, ప్రజలు వాహనాలను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పూడూర్ గ్రామం గ్రామ పంచాయతీ ఉన్న సమయంలో చెత్తను వేయడానికి గాను గతంలో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కేటాయించి అందులో 200 గజాల షెడ్డును నిర్మించామని తెలిపారు. కాగా అందులో కేవలం గ్రామంలోని చెత్త వేసి ఎప్పికప్పుడు రీ సైక్లింగ్ చేసుకుని ఎలాంటి పొల్యూషన్ లేకుండా చేసుకునే వారిమని, కాని నేడు ఎకరం స్థలంలో కాకుండా దాని చుట్టు పక్కన ఉన్న ప్రభుత్వం భూమిలో చెత్తను వేయడంతో నేడు పది ఎకరాల స్థలంలో చెత్త నిండిపోయిందని ఆరోపించారు. మేడ్చల్ పరిసర గ్రామాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండివాహనాలతో చెత్తను తీసుకొచ్చి వేయడంతో ఇక్కడ మరో జవహర్ నగర్ డంపింగ్ యార్డు తయారవుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్తను వేయడం నిలిపివేయాలని గతంలో కలెక్టర్, తహసీల్దార్ డిప్యూటా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా చెత్త వేయడం రోజు రోజుకు పెరుగుతున్నదని తెలిపారు. చెత్త వేయడమే కాకుండా ఆ చెత్తను తగుల పెట్టడంతో పరిసరాల వాతావరణ, నీరు కలుషితమౌతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను వేయడం ఆపకపోతే గ్రామ ప్రజలము మేడ్చల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సత్తిరెడ్డి, బాబు యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ధర్మాన్ని ప్రతి ఇంటికి చేరేలా కృషి



పొన్నాల్‌లో జరిగిన ఎబిఎపి సభలో మేడ్చల్ జిల్లా నూతన కమిటీకి ఎన్నికైన వారి దృశ్యం

**శామీర్‌పేట, మే 9, ప్రభాతవార్త:** శ్రీఅయ్యప్ప ధర్మాన్ని ప్రతి ఇంటింటికి తీసుకవెళ్తూ స్వామియే శరణం అయ్యప్ప నామాన్ని ప్రతి ఒక్కరి చేత స్మరింప చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార (ఎబిఎపి) సభ జాతీయ పిఆర్‌ఓ రాయబారపు రవిరాజు పేర్కొన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని పొన్నాల్ గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో ఎబిఎపి సభ అధ్యక్షులు దుర్గాపతి మధు అధ్యక్షతన జరిగింది. దీనికి ముందుగా శ్రీఅయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం జరిగింది. ఆ తరువాత ఈ సందర్భంగ జరిగిన సమావేశం (సభ)లో ఎబిఎపి జాతీయ పిఆర్‌ఓ రాయబారపు రవిరాజు మాట్లాడుతూ శబరిమలలో అతి సమీపంలోని నారాయణతోడ్లోని ఎబిఎపి అన్నదాన మందిరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి అక్కడికి వెళ్లే భక్తులకు సరుకులు పంపించటానికి తీర్మాణం చేయటం జరిగిందన్నారు. ఆ తరువాత మేడ్చల్ జిల్లా ఎబిఎపి నూతన కమిటీని సభ్యులు ఎన్నుకోవటం జరిగిందన్నారు.

ఈ ఎన్నికలు జాతీయ పిఆర్‌ఓ రాయబారపు రవిరాజు, ఎన్నికల అధికారి జె.రామమూర్తి, ఎన్నికల పర్యవేక్షకులు తెలంగాణ పిఆర్‌ఓ జనగామ తిరుపతిల సమక్షంలో జరిగినట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా ఎబిఎపి నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా తుమ్ సత్యంగురుస్వామి, అధ్యక్షులుగా శ్రీపతి నాగరాజు, ఉపాధ్యక్షులుగా కందల మైసయ్య, కార్యదర్శిగా సామల బుచ్చిరెడ్డి, ఉపకార్యదర్శిగా తొర్రి మల్లేశ్, కోశాధికారిగ వట్టెల సాయికుమార్, డిస్టిక్ కమాండెంట్‌గా రాంపల్లి వెంకటేశ్, మేడ్చల్ జిల్లా పిఆర్‌ఓగా టేకుల మధుసూదన్‌రెడ్డి, సభ్యులుగా బాబు, బుచ్చిరెడ్డి, నర్సింలు, గణేశ్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, బాల్‌రాజ్‌లు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో వారితో పాటు అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

## ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలి

**-చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**వికారాబాద్, ప్రభాతవార్త :** హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిది గృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్, రామమందిర నిర్మాణం, పశ్చిమ బెంగాల్ విజయాల తర్వాత మోడీ తొలిసారి తెలంగాణ రాష్ట్రానికి రావడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని వారసత్వ, కుటుంబ పార్టీలు ప్రజలను దోచుకుంటున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. గ్రామాలలో వీధిలైట్ల నుండి మున్సిపల్, పట్టణాల జాతీయ రహదారులు, రైల్వేలలో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే సాధ్యమవుతోందని స్పష్టం చేశారు. సభకు వచ్చే వారి కోసం జిల్లాలోని పరిగి,కొడంగల్, తాండూరు, వికారాబాద్‌ల నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, బీజేపీ జిల్లా కన్వీనర్ ప్రహ్లాద్‌రావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు కోకట్ మాధవరెడ్డి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు, దిశ కమిటీ మెంబర్ మిట్టా పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు యాష్కి షిరీష, సీనియర్ నాయకులు శివరాజ్, యు.రమేశ్ కుమార్, పాండుగౌడ్, మల్లేశం, నరోత్తంరెడ్డి, వివేకానంద్‌రెడ్డి, ముకుంద నాగేశ్వర్, గిరిమోని శ్రీనివాస్, కౌన్సిలర్ అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ గార్డెన్ ప్రారంభం



**కడ్తాల్, మే 9, ప్రభత వార్త :** కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో గ్రామ సర్పంచ్ బొప్పిడి గోపాల్ నూతన ఫంక్షన్ హాల్ ( లక్షి ్మ నరసింహ గార్డెన్) శనివారం గార్డెన్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నేత ఉప్పల వెంకటేష్ గుప్తా హాజరై గార్డెన్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్ నిర్వాకుడు , సర్పంచి బొప్పిడి గోపాల్ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**మరమ్మత్తుల కారణంగా ..**

## కొత్తగూడ, కొత్తూరు గ్రామాలలో విద్యుత్ అంతరాయం

**విద్యుత్ ఎఇ వేణుగోపాల్ రెడ్డి**

**కందుకూరు, మే 9, (ప్రభాతవార్త):** కందుకూరు మండలం కందుకూరు విద్యుత్ సరఫరా సబ్స్టేషన్ నుండి కొత్తగూడా, కొత్తూరు గ్రామాలకు వెళ్లే విద్యుత్ సరఫరా 33 లైన్లో మరమ్మతుల కారణంగా 14వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ అధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో గ్రామాల పరిధిలో వ్యవసాయ ఫీడర్ల అందు మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు రైతులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని అంతరాయాన్ని గమనించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏ ఈ కోరారు .



# జెబిఐటిలో ఘనంగా ప్లేస్‌మెంట్ డే

**మొయినాబాద్, మే 9, ప్రభాతవార్త :** ప్రపంచ పరిశ్రమల ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ నాణ్యమైన విద్యను అందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం తమ సంస్థ యొక్క ప్రధాన లక్ష ్యమని జేబీ విద్యాసంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జేబీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, భాస్కర ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమల ప్రముఖులు, విద్యావేత్తలు, అధ్యాపకులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అకాడమిక్ అలయన్స్ ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రీజియన్ హెడ్ చిత్రగడ్డ పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా ఫ్యూచర్ సిటీ డిప్యూటీ కమిషనర్ యోగేష్ గౌతమ్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో తమ ప్రతిభతో అలరించారు. ఈ సందర్భంగా జేవీ కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో సృజనాత్మకత, ఆవిష్కరణలను పెంపొందించే దిశగా కళాశాల కృషి చేస్తోందన్నారు. సమాజానికి ఉపయోగపడే వృత్తిపరమైన సేవా అవకాశాలను అందిస్తూ 740 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. 2026 సంవత్సరంలో కళాశాల 95 శాతం ప్లేస్‌మెంట్ సాధించడం గర్వకారణమని తెలిపారు. ముఖ్య అతిథి చిత్రగడ్డ మాట్లాడుతూ 2022 నుంచి 2026 వరకు జేబీఐటీ కళాశాలలో 3,750కు పైగా ప్లేస్‌మెంట్లు నమోదయ్యాయని తెలిపారు. ఇది సంస్థలోని బలమైన అకాడమిక్ పునాది, నైపుణ్యాభివృద్ధి శిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ డిప్యూటీ కమిషనర్ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ విజయం కేవలం మేధస్సు లేదా ప్రతిభతోనే సాధ్యంకాదన్నారు. అసోసియేషన్ మేనేజర్ జి బాబ్జి ఇండియా క్యాంపస్ లీడ్ అభిషేక్ దోయ్ జోడే బోస్ గ్లోబల్ సాఫ్ట్వేర్ టెక్నాలజీ లిమిటెడ్ కేపబిలిటీ బిల్డర్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లీడర్ శశికళ రెడ్డి ప్రవీణ్ డిజి విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మే 11 నుంచి మోడల్ స్కూల్లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**చేవెళ్ల, మే 9, ప్రభాతవార్త :** పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల చేవెళ్ళ లో ఈ నెల 11 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ ( వేసవి శిక్షణ శిబిరం) ఏర్పాటు చేయబడిందని పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి మరియు మండల విద్యాధికారి పురందస్ తెలిపారు. ఇట్టి సమ్మర్ క్యాంప్ లో 6వ తరగతి నుండి 9 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు.



మండల విద్యాధికారి పురందాస్

ఇట్టి సమ్మర్ క్యాంప్ లో 100 మంది విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం ఉందని ఇందులో చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, యోగా, కరాటే, కంప్యూటర్ శిక్షణ, పర్సనాలిటీ డెవలప్మెంట్, సైన్స్ ప్రయోగాలు, క్విజ్ మొదలైన అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ క్యాంప్ లో పాల్గొనే విద్యార్థులకు ప్రతి రోజు స్నాక్స్ అందజేస్తారని మండల విద్యఅధికారి పురందస్ అన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన మొదలైన లక్షణాలు పెంపొందించడానికి ఈ సమ్మర్ క్యాంప్ దోహదపడుతుంది అని అన్నారు. మండలంలోని 6 వ తరగతి నుండి 9 వ తరగతి చదివే విద్యార్థులు ఎవరైనా ఇట్టి సమ్మర్ క్యాంప్ లో ప్రవేశం పొందవచ్చు. ప్రవేశం పొందడానికి పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల చేవెళ్ళ లో సంప్రదించాలని పాఠశాల ప్రిన్సిపల్ కోరారు. ఈ ప్రవేశం పొందడానికి విద్యార్థి పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రాగలరుసమయం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు. రాగలరని ప్రిన్సిపాల్ తెలిపారు.

## తాగునీటి బోరు మోటర్ ప్రారంభం



బోరు మోటర్ ప్రారంభిస్తున్న దృశ్యం

**చేవెళ్ల, మే 9, ప్రభాతవార్త** చేవెళ్ల మున్సిపాలిటీ 12వ వార్డులో నూతన బోరు మోటర్ ను మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి శనివారం ప్రారంభించారు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ 12వ వార్డులో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ మనీషా అనంత రెడ్డి చేసిన కృషి అభినందించారు. ఈ కార్యక్రమం లో నాలుగో వార్డ్ కౌన్సిలర్ మాధవి యాదిరెడ్డి, 15వ వార్డ్ కౌన్సిలర్ శైలజ, ఇంద్రసేనారెడ్డి, యాదిరెడ్డి జిలాని సద్దాం భుజంగారెడ్డి రాజు , శ్రీశైలం కుమార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

**శంకర్‌పల్లి, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా శంకపల్లి మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ జన్వాడ స్కూల్ లో, 11.05.2026 నుండి 25.05.2026 వరకు ప్రతిరోజు ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 వరకు 6 9 క్లాసుల 100 పిల్లలకు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని శంకర్ పల్లి మండల విద్యాధికారి శనివారం తెలిపారు. క్యాంపులో వివిధ రకాలైన ఆర్ట్స్, స్పోర్ట్స్, యోగ, కోడింగ్ వంటి కార్యక్రమాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది..ఇట్టి కార్యక్రమాన్ని తల్లిదండ్రులందరు తమపిల్లల వేసవి సెలవులు వృధా కాకుండా, ఉపయోగపడేలా సమ్మర్ క్యాంపుని వినియోగించుకోవాలని కోరారు.

## విషాదంలో ఉన్న కుటుంబానికి ధైర్యం చెప్పిన ఎంపి డికె అరుణ



సదానందం గౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపి డికె అరుణ

**కొత్తూరు, మే 9, ప్రభాతవార్త;** కొత్తూర్ మున్సిపాలిటీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కడెంపల్లి సదానందం గౌడ్ కుటుంబాన్ని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ పరామర్శించారు. ఇటీవల ఆయన కుమారుడు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపి శనివారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించిన ఆమె, కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని ఆకాంక్షి ంచారు. పమర్శించినవారి లో బీజేపీ సీనియర్ నాయకులు అందే బాబయ్య, నాగరాజు చారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ వికాసానికి సమ్మర్ క్యాంప్

**కొత్తూరు, మే 9, ప్రభాతవార్త;** కొత్తూరు మండల కేంద్రంలో పిఎంసి జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈనెల 11వ తారీకు నుంచి 25వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పియంసి జడ్పీహెచ్ఎస్ కొత్తూర్ ప్రధానోపాధ్యాయుడు కే అంగూర్ నాయక్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు వివిధ వినోదాత్మక విద్యాపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు సమ్మర్ క్యాంప్ లో ఆర్ట్ క్రాఫ్ట్ పుస్తక పఠనం కథల చర్చ క్రీడలు సైన్స్ ప్రయోగాలు కంప్యూటర్ నైపుణ్యాలు నృత్యము సంగీతము యోగ క్విజ్ మెదడుకు సంబంధించిన వ్యాయామ కార్యక్రమాలను నిర్వహిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఇందుకోసం ఫోన్ నెంబర్లు 9440417434 జిహెచ్ మో9848553415 ఎస్ఎ ఇంగ్లీష్ 9963081675 ఎస్ఎ పిడిలను సంప్రదించాలన్నారు.

## మోడీ సభను విజయవంతం చేద్దాం

**షాబాద్, మే 9, ప్రభాతవార్త :** ఈ నెల 10న నగరంలో పేరేడ్ గ్రౌండ్లో జరిగే మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య అన్నారు. శనివారం షాబాద్లో ఆయన మాట్లాడుతూ... దేశ ప్రధానమంత్రి నరేం ద్రమోదీ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని అన్నారు. ఖిదేశంలో జరిగిన 5 రాష్ట్రల ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోదీ సభకు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాము, మహేందర్, రమేష్, నరేంద్రరెడ్డి, రవిగౌడ్, మహేందర్, విజయ్, అనంతం తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి రూ.50వేలు ఆర్థిక సాయం

**ఎన్నికల హామీని నెరవేరుస్తున్న సర్పంచ్ లక్ష్మమ్మ**



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి మే 9, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలో నీ చీపునుంతల గ్రామంలో ఆడపిల్ల వివాహానికి గ్రామ సర్పంచ్ గుజ్జుల లక్ష ్మమ్మ ఆశన్న వ్యక్తిగతంగా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేస్తూ గ్రామంలోని నిరుపేద ఆడపిల్లలకు వివాహం జరిగితే వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేస్తానని మాట ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గా శనివారం నాడు గ్రామానికి చెందిన మద్దూర్ సువర్ణ వెంకయ్యల కూతురు వివాహానికి రూ.50 వేలు అందజేశారు.గ్రామానికి చెందిన మాలె రవీంద్రారెడ్డి సహకారంతో అందజేసినట్లు మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుజ్జల మహేశ్ తెలిపారు.ఆడపిల్ల పెళ్ళి కానుకగా ఆర్థికసాయం అందజేయటంతో గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జులా లక్ష ్మమ్మ ఆసన్న, కాంగ్రెసు పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జులా మహేశ్, నాయకులు రవీంద్రరెడ్డి,శ్రీరామ, శ్రీశైలం,వెంకట్రాజరెడ్డి, పెంటయ్యా, మల్లేష్, శేఖర్ ,ఖాసిం తదితరులు ఉన్నారు.




జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్‌బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

## మహారాణా ప్రతాప్ చరిత్ర పాఠ్యంశాల్లో పొందుపర్చాలి

**-- ఆర్‌బిఓఎల్ సిఇఒ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి**

**తాండూరు, మే 9, ప్రభాతవార్త :** మొఘలులపై పోరాడి ఆత్మగౌరవం కాపాడిన రాజ్‌పుత్ వంశానికి చెందిన మహారాణా ప్రతాప్ చరిత్ర పాఠ్యాంశాల్లో పొందు పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆర్‌బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

మాతా జీజియాబాయి తన కొడుకును ధీరుడిగా తీర్చిదిద్దారని, రాణీ జైవంత బాయి కూడా తన కొడుకు రాణా ప్రతాప్ ను హిందువుల ఆత్మగౌరవం నిలిపేలా శత్రువులను ఎదుర్కొనేలా తీర్చిదిద్దారని కొనియాడారు. రాణా ప్రతాప్ జయంతి సందర్భంగా శనివారం రాజ్‌పుత్ సమాజం ఆద్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని భద్రేశ్వర చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 600 ఏండ్ల క్రితం భారతదేశంలో జరిగిన దండ యాత్రల్లో శత్రువులను చీల్చి చెండాడిన ధీరుల గురించి ప్రతీ ఇంట్లో తెల్సుకోవాలని సూచించారు.

పాఠ్య పుస్తకాలలో ఇలాంటి హిందూ వీరుల గురించి పొందు పర్చాలని అన్నారు. తాండూరులో ఓ లైబ్రరీ ఏర్పాటు చేసి వారి జీవిత గాథల పుస్తకాలు అందజేస్తానని తెలిపారు.

బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ లేని విధంగా రాణా ప్రతాప్ జయంతి తాండూరులో జరుపుకోవడం అభినందనీయమని అన్నారు.

రాజ్ పుత్రులను ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజా, బిఆర్‌ఎస్ నాయకులు రాజుగౌడ్, పర్యాద రామకృష్ణ, ఠాకూర్ సూరజ్ సింగ్, దిలీప్ సింగ్, అజయ్‌ప్రసాద్, రమేష్ సింగ్, దినేష్ సింగ్, సుభాన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అమావాస్య సమ్మెకు మద్దతిచ్చిన సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

**జవహర్ నగర్, మే 9.ప్రభాత వార్త:** మేడ్చల్ నియోజకవర్గంలోని బాలాజీనగర్, జవహర్‌నగర్ ప్రాంతాలకు చెందిన సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఈ రోజు జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య బిఆర్ఎస్ యువ నాయకుడు మేకల భార్గవ్ అధ్యక్షతన మాజీ కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూరమల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా 16/05/2026 అమావాస్య రోజునుండి చేపట్టనున్న సమ్మెకు సంబంధించి తమ సమస్యలు, డిమాండ్లను వివరించి, ప్రభుత్వదృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గృహప్రవేశం పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్

**నందిగామ, మే 9, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపిటిసి, బిఆర్ఎస్ సీనియర్ నేత ఎర్ర అంజయ్య గౌడ్ కుమారుడు ఎర్ర మధుసూదన్ గౌడ్ కొత్తగా నిర్మించిన నూతన గృహప్రవేశ పూజల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో పలువురు రాజకీయ ప్రముఖులు, నవీన్ రెడ్డి యువసేన నందిగామ మాజీ వార్డ్ సభ్యుడు తుప్పుడు కృష్ణ, బిఆర్ఎస్ నాయకుడు శివగళ్ల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి గారిని మాజీ ఎంపీటీసీ ఎర్ర అంజయ్య గౌడ్, ఆయన కుమారులు శాలువాల తో సన్మానించారు.

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

**కుల్కచర్ల,మే,9 ప్రభాతవార్త:** చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలనికి అండగా నిలిచారు.మండల కేంద్రానికి చెందిన పాలేపల్లి వెంకటయ్య ఇటీవల అనా రోగ్యంతో అకాల మరణం చెందాడు.విషయం తెలుసు కున్న 1997–98 పదవ తరగతి బ్యాచ్‌మిత్రులు తమ వంతుగా మిత్రుని కుటుంబా నికి అండగా నిలవాలని సంకల్పించారు. రూ. 50వేలు సేకరించి మృతుని కుటుంబానికి శనివారం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు స్నేహి తులు మాట్లాడుతూ.. ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మకొకటి లేదని అందరితో మమేకమై కలివిడి కష్టసుఖాలను పాలుపంచుకునే ఆప్త మిత్రుడు దూరమవ్వడం చాలా బాధాకరమన్నారు.



మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు మొరా వెంకటయ్య, కే, సోమలింగం, నరసింహారెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి,బుచ్చయ్య, నర్సింలు గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ మెగాగ్యాస్

**షాద్‌నగర్, మే 9, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో మహబూబ్ నగర్ రోడ్డులో షాద్ నగర్ పట్టణానికి ఇంటి ఇంటికి మెగాగ్యాస్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మెగా గ్యాస్ ప్రతినిధులు రాజేష్ మంకోహ(డిప్యూటీ డైరెక్టర్) శైలేందర్ కుమార్ శర్మ (డిప్యూటీ కన్సల్టెంట్), కౌన్సిలర్ పెంటయ్య , వ ఖ ం ళీ వె ా ప ా న్ (అప్పి),రాజు నాయక్, దిలీప్, నరేష్,కొప్పునూరి ప్రవీణ్, ముబ్రరక్ అలీ ఖాన్, చందు లాల్, సాదిక్ అనిల్ తదితరులు హాజరయ్యారు.




పాల్గొన్న మున్సిపల్ చైర్మన్